


# రమణ భాస్కర

**ఆధ్యాత్మిక పక్షపత్రిక**

5-4-2001 (8)



## శ్రీ రమణ క్షేత్రం - జిన్నూరు

పశ్చిమ గోదావరి జిల్లా - ఆంధ్రప్రదేశ్. పిన్ : 534 265

# సద్గురు శ్రీనాన్న గారి అనుగ్రహ భాషణములు

| | |
|---|---|
| 11-4-2001, బుధవారం | ఐ-భీమవరం |
| 13-4-2001, శుక్రవారం | భీమవరం - అల్లూరి సీతారామరాజు కళ్యాణ భవనం, ఎ.యస్.ఆర్. నగర్ (కీ॥శే॥ ఉద్దరాజు ఆనందరాజుగారి 22వ వర్ధంతి సందర్భముగా) |
| 19-4-2001, గురువారం | పాలకొల్లు - పెన్మెత్స సత్యనారాయణ రాజు & సూర్య పద్మావతి క్షత్రియ సంక్షేమ పరిషత్ కళ్యాణ మండపం |
| 22-4-2001, ఆదివారం | జిన్నూరు - శ్రీ రమణ క్షేత్రం. |

## శ్రీనాన్న సద్గురుభ్యోనమ:

కథయును కాదిది కల్లయును కాదిది
నిజగురు వైభవము మా నాన్నగురు వైభవము
ఏమని తెలిపెదను ఎంతని తెలిపెదను
ఆత్మతేజో రాజితవదమని శ్రీనాన్నదేవుని ॥ఏ॥

1 అతని రాకవేళ ఎదురు చూచు భక్తావళి కన్నుల
చిందు ఆనంద చెంద్రికలే నీరాజనంబై వెలుగగ
అతని వీడు వేళల భక్తుల కన్నుల కురియు బాష్పంబు
లతో సలుపు వదనంబులే తోరణంబులై వెలయంగ ॥ఏ॥

2 అలనాటి శ్రీ రమణుల కూడి
గిరి చుట్టిన భక్తుల సందడులే
ఈ నాటి శ్రీ నాన్నగురుల కూడి
గిరి చుట్టు భక్తుల భాగ్యంబది ॥ఏ॥

3 అతని కడగంటి చూపే చాలు
సకల కల్మషాపహరమ్మని
అతని చిరుదరహాసమే చాలు
భక్తుల పాలిటి బ్రహ్మానందమ్మని ॥ఏ॥



ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 6 సంచిక : 8 పుష్యం : 23-25 05-4-2001

**RAMANA BHASKARA**

**TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE**

PAGES : 12

**VOL: 6** **ISSUE: 8**

EDITOR
**P. S. RAMA RAJU**

EDITING
**P.H.V. SATYAVATHI (HYMA)**

**SUBSCRIPTION**
YEARLY : **Rs. 140/-**
Each Copy : **Rs. 10/-**

ADDRESS
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
JINNURU - 534 265
W.G.Dt., A.P.

**PUBLISHER**
P.S.RAMARAJU
LAKSHMI MODERN RICE MILL
ULLAMPARRU - PALAKOL
☎ 08814 - 24589, 24689

**PRINTER**
SHRIRAM GRAPHICS
BANK STREET - PALAKOL
☎ 08814 - 22438, 24278

## వింతజంతువులు సంచరించే ఆటవిక సమాజంలో ఆత్మజ్ఞానుల (బుద్ధుల) పరిస్థితి

సమాజము భూతభవిష్యత్ వర్తమానాలలో ఆటవికంగానే ఉంటుంది. ఆత్మ విస్మృతివల్ల కలిగిన అజ్ఞానము నుండి జనించిన అహంభావాల సమూహమే మన సమాజము. అహంభావము అనాత్మతో తాదాత్మ్యం పొంది దేహాత్మ బుద్ధితో ఉన్న మూలాన అది చేసే ప్రతీ పని స్వార్థపరమై సంఘర్షణకు దారితీస్తుంది. అట్టి సమాజం విలువలు, అజ్ఞానంలో ఉన్న అహభావం ఏర్పరచినవి. ఇవి స్వార్థపూరితంగా ఉండటం మూలన హింస, సంఘర్షణ, పోటీతత్వం ఎక్కువగా ఉండి, మనిషి బహిరంగంగా ఎంతో నాగరికంగా ఉన్నట్లు నటించినప్పటికి, అంతరంగంలో పశువుల కన్నా హీనమైన గుణాలతో ఉన్న మానవులు సమాజంలో ఎక్కువ. ఇట్టివారు వింతజంతువులు. దైవానుగ్రహానికి పాత్రులైన కొంతమంది ఆత్మజ్ఞానము పొంది, సమాజములో ఉన్న లోటుపాట్లను వేలెత్తి చూపుతారు. ఇది సమాజము భరించలేదు. అందుచేతనే ఈ సమాజము ఏసుక్రీస్తును శిలువ వేసినది, సోక్రటీసును విషమిచ్చి చంపినది, గౌతమ బుద్ధునికి విషాహారం తినిపించి చంపినది, ఆదిశంకరుల మీద హత్యాప్రయత్నం జరిగినది, సర్మద్ అనే ఆత్మజ్ఞానిని సౌదీ అరేబియాలో ఖండఖండాలుగా నరికి చంపినది, ఈ మధ్యలో బుద్ధభగవానుని విగ్రహాలు విస్ఫోటంతో నాశనం చేస్తున్నది. ఆత్మజ్ఞానులకు మానవజాతి మీద ఉన్న ప్రేమకు, మానవజాతి ఇచ్చే కానుక ఇది. ఇదీ మన ఆటవిక సమాజంలో వింతజంతువుల మధ్య జీవించే ఆత్మజ్ఞానుల (బుద్ధుల) పరిస్థితి.

.... ఎడిటర్

**ఈ సంచికలో............**

సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు

28-11-2000 పాతాళమెరక .................... 2
14-02-2001 సఖినేటిపల్లి .................... 6
25-02-2001 సామర్లకోట .................... 9

## సత్యాత్మలో ఉండి పనిచేసినప్పుడు బేధబుద్ధి ఉండదు. దేహంతో తాదాప్యం పొంది పనిచేసినప్పుడు బేధబుద్ధి కలుగుతుంది.

సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 28-11-2000, పొతాళమెరక

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

సమత్వం జ్ఞానియొక్క లక్షణం. సృష్టిలో బేధం ఉంటుంది కాని హృదయంలో అబేధంగా ఉండాలి అన్నారు భగవాన్. సృష్టిలో ఉన్న భేదాన్ని దృష్టిలోపెట్టుకొని హృదయంలో అబేదంగా ఉండి లోకంయొక్క పోకడబట్టి పరిస్థితిని బట్టి ప్రవర్తించాలి. అంతాఒకటే కదా లోకంలో భేదం, హృదయంలో అభేదం ఏమిటి అని ప్రశ్నిస్తున్నారు. దానికి భగవాన్ ఏమిచెపుతున్నారు అంటే నీ హృదయంలో ఉన్నది, నా హృదయంలో ఉన్నది ఒక్కటే అలాగని నేను కూర్చొన్న సోఫాలో నేను మిమ్మల్ని కూర్చోమన్నా కూర్చోరు. అదే బేధం అంటే. ఆబేధాన్ని మనం గౌరవించవలసిందే. అబేధదృష్టిని మన హృదయంలో అనుభవిస్తూనే ఉండాలి. అది మన హృదయంలో అనుభవంలోనికి వస్తేగాని మనకు శాంతి దొరకదు. లోకం యొక్క వ్యవహారాన్ని బట్టి బేధం ఉంటుంది. అంతమాత్రంచేత ఒక జీవుడు ఎక్కువ అని, ఒక జీవుడు తక్కువ అనికాదు హృదయంలో అందరూ ఒక్కటే అన్నారు భగవాన్. లోకం యొక్క ధర్మాన్ని బట్టి మనం ప్రవర్తించాలి. శాస్త్రంలో గాబరాపెట్టే మాటలు చాలా అద్భుతంగా చెపుతారు. హిందూమతంలో ద్వైతం గురించి, అద్వైతం గురించి చాలాపోరాటం ఉంది. భగవాన్ దానిగురించి చాలా చమత్కారంగా చెప్పారు. నీవు దేహంతో కలిసిఉంటే ద్వైతం, దేహం నీవుకాదు అని నీకు తెలిస్తే అద్వైతం. దేహంతోనీకు తాదాప్యం ఉంటే నీవు ద్వైతంలో ఉన్నట్లే. దేహంతో నీకు తాదాప్యం లేకపోతే అద్వైతం.

సైన్స్ అభివృద్ధి అయ్యిందిగాని మానవస్వభావం పూర్వం రామాయణకాలంలో, భారత కాలంలో ఎలా ఉందో ఇప్పడుకూడా అలాగే ఉంది. విరోధాలు, కక్షలు, అసూయ, ఓర్వు లేకపోవటం ఇవి అన్నీ అలాగే ఉన్నాయి. ఒక వస్తువును కనిపెట్టటంకంటే మానవ స్వభావం మార్చుకోవటం చాలాకష్టం. దీనికి సత్సంగ సమావేశాలు, సత్పురుషుల సహవాసం అవసరం. నీ స్వభావం నీవు మార్చుకోవటం చాలాకష్టం. దానికెంతో పోరాటం ఉండాలి, భావనాబలం ఉండాలి. ప్రకృతిలో విబేధాలు ఉంటాయి, మనిషి మనిషికి బేధం ఉంటుంది. ఇవి అన్నీ సమన్వయం చేసుకొంటూ అందరిలోనూ ఉన్న సత్యవస్తువును చూడాలి. గురువు కొందరితో కోపంగా, కొందరితో ఉదాసీనంగా, కొందరితో ప్రేమగా ఉంటాడు. ఎవరితో ఎలా చెప్పాలో అలాగ చెపుతాడు. మనిషినిబట్టి ప్రవర్తిస్తాడు కాని అక్కడ లోపల ఏమీ వికారాలు ఉండవు. ఏదిచేసినా ఆయన అనుగ్రహమే. ఆత్మసాక్షాత్కారం పొందినవాడికి ఈ అభిప్రాయబేధాలు అన్నీ నిజంకాదు అని వాడికి తెలుస్తూ ఉంటుంది. ఇవి అన్నీ నిస్సారమైనవి, ఇవి అన్నీ పైపై

విషయాలేగాని వీటి ప్రభావం జ్ఞానిమీద ఏమీ ఉండదు. సినిమాలో ఇద్దరు పోరాడుతున్నారు అనుకోండి. చిన్నపిల్లలు అది నిజం అనుకొంటారు. మనం కూడా అది చూస్తాముగాని అది సినిమా అనుకొంటాము. అలాగే జ్ఞానికి ఈలోకం యొక్క పోకడ అంతాకూడా ఒక సినిమా వంటిది. నీవు ఎన్ని సాధనలు చేసినప్పటికి ఈలోకం నిజం అనుకొన్నంతకాలం నీ మనస్సు ఏదోమూలనుండి బయటకు వచ్చేస్తుంది. ఈలోకం నిజంకాదు అని నీకు తెలిసినప్పుడు నీ మనస్సు యొక్క చాపల్యం ఆగిపోతుంది. భగవాన్ ఎక్కువగా శాంతి గురించి చెప్పేవారు. నీ స్వరూపమే శాంతి, నీపేరే శాంతి, అంతా శాంతే అనేవారు. ఆయన చెప్పినది అలౌకికమైన శాంతి, ఆత్మశాంతి. మన మనస్సు నిర్మలంగా ఉంది అనుకోండి, శాంతిగా ఉంది అనుకోండి ఏటైములో ఏపని చేయాలో అదే చేస్తాము, అవసరమైన పని చేస్తాము, అవసరమైన మాటలు మాట్లాడతాము, ఇంద్రియాలు సహజంగా వాటిపని అవి చేసుకొనిపోతాయి, అవి టైర్ అవ్వవు. మనలో ఉన్న శాంతి అలా కరెక్టుగా పనిచేయిస్తుంది. మనం ఉద్రేకంగా ఉంటే చాలా విషయాలు మర్చిపోతాము, ఇతరుల పట్ల మన ప్రవర్తన సరిగా ఉండదు. మన శత్రువులు ఎక్కడో ఉన్నారు అనుకొంటున్నారేమో కామక్రోధములే మన శత్రువులు. అవి రజోగుణం నుండి వస్తున్నాయి. రజోగుణం అణిగితేగాని అవి అణగవు.

ఒకడు విరోధి, ఒకడు స్నేహితుడు అని జ్ఞానికి ఏమీ ఉండదు. అతను కదలినా, మాట్లాడినా, కూర్చొన్నా అతని చేష్టలు అన్నీ ఆత్మపరంగానే ఉంటాయి, సత్యపరంగానే ఉంటాయి. మనం మాట్లాడుతూ ఉంటే అహంకారం మాట్లాడుతుంది. జ్ఞాని మాట్లాడుతూ ఉంటే సత్యం మాట్లాడుతుంది. జ్ఞాని మీ హృదయంలో ఉన్న సత్యమునే చూస్తూ ఉంటాడు. అయితే మీలో ఉన్న బేధాలు గమనించడా అంటే గమనిస్తాడుగాని అవి అప్రధానమైన విషయాలు, వాటికి ఏమీ ప్రాముఖ్యత లేదు అని జ్ఞానికి తెలుస్తూ ఉంటుంది. మన చెయ్యి చాలా చిన్నదే అయినా దానిని మనకంటికి అడ్డుగా పెట్టుకొంటే ఇంక బయట ఏమీ కనబడదు. అలాగే దేహము నేను అనేది చిన్న తలంపు అయినా మన హృదయంలో ఉన్న బ్రహ్మం మనకు అనుభవంలోనికి రాకుండా అది అడ్డువస్తోంది. దానిని తొలగించుకోవటానికి అభ్యాసం, వైరాగ్యం అవసరమని గీతలో భగవంతుడు చెప్పాడు. లోకం నిజంకాదు, లోకం నిజంకాదు అని ఎందుకు చెపుతారు అంటే సాధకుడికి అలా చెప్పకపోతే మనస్సు లోపలకు ఉపసంహరింపబడదు. లోకం లోకంగా నిజంకాదు, లోకం బ్రహ్మంగా నిజం. గొలుసు గొలుసుగా నిజంకాదు, గొలుసు బంగారంగా నిజం. ఎందుచేతనంటే బంగారం మాకు ఇచ్చేసి మీరు గొలుసు తీసుకోండి అంటే బంగారం తీసేస్తే గొలుసు ఎక్కడ ఉంది గొలుసు లేనేలేదు. అలాగే బ్రహ్మం తీసేస్తే లోకం లేనేలేదు.

నిప్పుకు వేడి ఎంత సహజంగా ఉంటుందో జ్ఞానికి దయ అంత సహజంగా ఉంటుంది. మన దయలాంటిది కాదు అది కళ్యాణ గుణం. జ్ఞాని ఒక అద్దంలాంటివాడు. మీరు సంతోషిస్తే

ఆయన సంతోషిస్తాడు, మీరు దుఃఖపడితే ఆయనా దుఃఖపడతాడు కాని అక్కడ వ్యక్తి భావన ఉండదు. మనకు నిజం తెలియకపోయినా ఏది నిజమో జ్ఞానికి తెలుస్తూ ఉంటుంది. అందువలన అన్ని అవస్థలలో, అన్ని పరిస్థితులలో ఒకేవిధంగా ఉంటాడు. మనం పరిస్థితులు అనుకూలంగా ఉంటే ఒకలాగ, ప్రతికూలంగా ఉంటే ఒకలాగ ఉంటాము. మన మనస్సును హృదయంవైపుకు నెట్టటానికే ప్రతికూలపరిస్థితులను పంపుతున్నాడు, ఇది ఈశ్వరుని పన్నాగము, ఇది మన మంచికే చేస్తున్నాడు అని మనకు అర్థంకావటంలేదు. ప్రతికూల పరిస్థితులు వచ్చినప్పుడు ఒకోసారి మీ మనస్సుకు అంతర్దృష్టి కలుగుతుంది. మీరు ఎవరిమీద అయితే ఎక్కువ మమకారం పెట్టుకొన్నారో వారు ఎదురు తిరిగితే మీరు వందసంవత్సరాలు సాధనచేసిన దానికంటే ఒకోసారి దీనివలన మీ మనస్సు లోపలకు వెళుతుంది. రోజూ భగవద్గీత చదివినంత మాత్రాన మనస్సులోపలకు వెళుతుంది అనుకోవద్దు. దానికి మొట్టికాయలు తగులుతూ ఉంటే మనస్సు లోపలకు వెళుతుంది. ఈ సంఘటనలు అన్నీ మన మంచికే భగవంతుడు పంపుతున్నాడు అని మనం గ్రహించాలి. ఎటువంటి పరిస్థితులు వస్తే మీ మనస్సు లోపలకు వెళుతుందో చూసి భగవంతుడు అవి క్రియేట్‌చేస్తాడు. అప్పుడు ఏదో అపకారం జరుగుతోంది అని మీరు అనుకొంటారు కాని అపకారం జరగదు మీకు ఉపకారమే జరుగుతుంది. జ్ఞాని ఏదిచేసినా ఇతరులకోసమే. జ్ఞాని దేహం ధరించటం లోకానికి మంచిది, తన దేహంవలన తనకు ఏమీ ఉపకారం లేదు.

ఏ మనస్సు అయితే ధ్యానం చేస్తోందో ఆ మనస్సే లోకంలో కూడా పని చేస్తోంది. ఆ మనస్సువేరు, ఈ మనస్సువేరు అనుకోవద్దు. మనస్సు అణిగిపోతే ఏమీలేదు. ధ్యానం కూడా ఎందుకు చేస్తున్నాము మనస్సు అణగటానికే కదా. అలాగే లోకంలో నీవు చేసే పనులు నీ మనస్సు అణిగేలాగ ఆపనులు ఉంటే ఈ జన్మలోనే మోక్షం వస్తుంది. మనం చేసేపని మనో నిగ్రహానికి సహకరించాలి. పనికూడా ధ్యానం లాగ మనకు సహకరించాలి. అది సాధన. ప్రపంచంలో అనేక సంఘటనలు జరుగుతూ ఉంటాయి. ఏ సంఘటన కూడా జ్ఞాని మీద ప్రభావం కలుగజేయదు. వాసుదేవుడికి తెలియకుండా ఆ సంఘటనలు జరగటంలేదు కాబట్టి జ్ఞానికి భయంలేదు. ఎందుచేతనంటే వాసుదేవునికి భిన్నంగా ఆయనలేడు. అందువలన ఏ సంఘటన జరిగినా ఆయనలో రియాక్షన్ ఏమీ ఉండదు. జ్ఞానికి పెట్టే నమస్కారం నాకు అందుతుంది అని భగవంతుడు గీతలో చెప్పాడు.

పూజచేసినా, జపం చేసినా, ధ్యానం చేసినా వాటివలన దేహాభిమానం తగ్గాలి. దేహాభిమానం నశిస్తేగాని నీకు ఆత్మజ్ఞానం కలుగదు. మనకు నేను అనేటప్పటికి దేహం ఎలా స్ఫురిస్తుందో, జ్ఞానికి నేను అనేటప్పటకి చైతన్యం స్ఫురిస్తుంది. మనం దేహం చనిపోయేటప్పుడు నేను చనిపోతున్నాను అనుకొంటాము, దేహం నేను అనేది ఒక తలంపు. చనిపోతున్నాను అనేది ఇంకో తలంపు. దేహం నేను అనే తలంపుకు చనిపోతున్నాను అనే

తలంపు వస్తోంది. ఈ తలంపు ఒక నిజానికి రావటం లేదు, ఇంకో తలంపుకు ఈ తలంపు వస్తోంది. ఇది గ్రహించాలి. దేహాభిమానం ఉన్నంతకాలం శవాలు రావటం మానవు. అయితే ఏజన్మకు ఆజన్మ మీరు చేసిన మంచి, మీరు చేసిన సాధన వృధాపోదు. పూర్వజన్మలో మనం చేసిన పుణ్యమే సత్పురుషుల సహవాసం చేయాలనే బుద్ధిని కలుగజేస్తుంది, సత్యాన్వేషణ చేయాలనే బుద్ధిని కలుగజేస్తుంది. సత్యాన్వేషణ చేయాలనే బుద్ధి కలిగాక కదా నీకు సత్యానుభవం కలగటం. జ్ఞాని ఈశ్వరుడి చేతిలో పనిముట్టులాగ ఉంటాడు. ఇప్పుడు పుస్తకం నా చేతిలో ఉంది. నన్ను నీ చేతిలో ఎందుకు పెట్టుకొన్నావు అని పుస్తకం అడగదు. క్రిందపడేసినా నన్ను ఎందుకు పడేసావు అని పేచీకిరాదు. ఈ పుస్తకం నా చేతిలో ఎలా ఉందో అలాగ జ్ఞాని ఈశ్వరుని చేతిలో ఉంటాడు. ఆయన సంకల్పమే ఈయన సంకల్పం. జ్ఞానికి స్వంత సంకల్పం అంటూ ఏమీ ఉండదు. మనం ఎప్పుడు ఏపనిచేయాలి అని ఆలోచించుకొంటాము. జ్ఞానికి మనస్సు ఉపయోగించకుండా, మనస్సుతో సంబంధం లేకుండా పనిజరిగిపోతుంది. జ్ఞాని మనస్సు కాలిపోయిన తాడులాగ ఉంటుంది. జ్ఞాని మనస్సు మృతమనస్సు.

మీ సాధన ఏదో మీరు చేసుకోండి. మీకు ఏది మంచిదో మీకంటే ఈశ్వరుడికి బాగా తెలుసు. అయితే మీరు ఈశ్వరుడి మీద భారం వేయటం లేదు కాబట్టి మీ మనస్సు రియాక్టు అవుతోంది. ఈశ్వరుడిమీద భారంవేసి జీవించటం నేర్చుకొంటే మిధ్యానేనును తొలగించటానికి దానితో మీరు పోరాడనక్కరలేదు, దానిఅంతట అదే పోతుంది. దేహాభిమానం ఉన్నవాడు నేను బంధంలో ఉన్నారు, నాకు మోక్షం ఎప్పుడు వస్తుంది అని ఆలోచిస్తాడు. దేహాభిమానం లేనివాడికి బంధంలేదు, మోక్షంలేదు. ఈ తారతమ్యాలు, గొడవలు అన్నీ మనస్సుకే. అసలు ఉన్నది మోక్షమే, అది నీ హృదయంలో ఎప్పుడూ ఉంది. నీకు తెలిసినా, నీకు తెలియకపోయినా అది ఉంది. అది తెలిస్తే సుఖం, తెలియకపోతే దుఃఖం. జ్ఞానం యొక్క విలువ మానవమనస్సుకు తెలియటంలేదు. జ్ఞానం యొక్క విలువ తెలిసినప్పుడు దానిని సంపాదించాలనే బుద్ధి కలుగుతుంది లేకుంటే ఆబుద్ధి మీకు కలుగదు. ఎదుటి మనిషిలో ఉన్న అర్హతను గుర్తించటానికి మనలోకూడా అర్హత ఉండాలి. మనలో లేనిది ఇతరులలో ఏదైనా విశేషం ఉన్నా మనం దానిని గుర్తించలేము. దేవుడికి ఉన్న జ్ఞానంలో మటుకు నాకు డౌట్ ఉంది అది ఉండవచ్చు, ఉండకపోవచ్చు అది నాకు డౌట్ ఉందిగాని మనిషికి ఉన్న అజ్ఞానంలో మటుకు నాకు డౌట్ లేదు, వాడు ఏపనిచేసినా అజ్ఞానంతో చేస్తాడు అని ఐన్‌స్టీన్ చెప్పాడు.

# విధి వలన వచ్చే కష్టములు శరణాగతిలో ఉన్నవాడికి సాధనకు ఉపకరించును.

### సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 14-2-2001, సఖినేటిపల్లి

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

రోగాలు అన్నీ దేహాన్ని ఆశ్రయించి ఉంటాయి, తలంపులు అహంవృత్తిని ఆశ్రయించి ఉంటాయి. నేను ఉంటే తలంపులు వస్తాయి, నేను లేకపోతే తలంపులురావు. దేహానికి ఉన్న రోగాలు అంతప్రమాదకరం కాదు. స్మశానంలో ఆదేహం కాలిపోయినప్పుడు ఆరోగాలు కూడా కాలిపోతాయి. కాని అహంవృత్తికి ఉన్న తలంపులు ఎక్కువ ప్రమాదం, అవి స్మశానంతో ఆగవు, దేహం మరణించిన తరువాత కూడా అవి ప్రయాణం చేస్తాయి. జీవుడికి, ఈశ్వరుడికి మూలం బ్రహ్మమే. జీవుడు వాడి వేషం తీసేస్తే, ఈశ్వరుడు వాడివేషం తీసేస్తే ఇద్దరూ ఒక్కటే, ఇద్దరూ బ్రహ్మమే. తిప్పలు అన్నీ ఈ వేషాల వలన వస్తున్నాయి. బ్రహ్మంకు ఒక రూపం లేదు, ఒక నామం లేదు, గుణం లేదు. వారు ఉన్నారు, నిర్మలంగా, నిశ్చలంగా పనిచేస్తున్నారు. ఏమతం చెప్పినా దానిని అందుకోమని చెపుతోంది. దానిని అందుకోవటం నోటితో చెప్పినంత తేలిక కాదు. రాత్రి అనక, పగలు అనక నది సముద్రంలో ఐక్యం అవ్వటానికి ప్రవహిస్తూనే ఉంటుంది. అలాగే మనస్సు యొక్క వృత్తి బ్రహ్మం వైపుకు ప్రయాణం చేస్తూ ఉంటే బ్రహ్మంలో ఐక్యమవుతుంది. అది సాధన అంటే.

ఇప్పుడు మనం ప్రపంచానికి దగ్గరగా ఉన్నాము. భగవంతునికి దూరంగా ఉన్నాము. ప్రస్తుతం దూరంగా ఉన్నా చనిపోయే రోజుకయినా దగ్గరపడతారేమో చేయిపట్టుకొని లాగుదామని భగవంతుడు చూస్తున్నాడు. కాని చనిపోయేరోజుకు మనం ఇంకాదూరమవుతున్నాము. మీరు ధనవంతులు అవ్వవచ్చు అవ్వకపోవచ్చు, మీకు అధికారం రావచ్చు రాకపోవచ్చు, మీరు పండితులు అవ్వవచ్చు అవ్వకపోవచ్చు వీటిలో సందేహాలు పెట్టుకోవచ్చు కాని దేహానికి చావు విషయంలో సందేహం పెట్టుకోవద్దు, నూటికి నూరుపాళ్ళు దేహానికి చావు వచ్చేస్తుంది. నీ దేహానికి చావు వచ్చే రోజుకయినా ఈలోపుగా ప్రిపేర్ అవ్వటానికి టైముఉంది కాబట్టి ప్రిపేర్అయ్యి నెమ్మదిగా లోకానికి దూరంగా ఉంటూ ఆరోజుకయినా బ్రహ్మంకు దగ్గరగా జరిగితే నీవు బ్రహ్మంలో ఐక్యమవుతావు. చాలా మందికి దుష్టబుద్ధి ఉంటుంది కాని అది సత్యబుద్ధి అనుకొంటారు. అది చాలా ప్రమాదం. అసలు ఉన్న బలహీనత తెలిస్తే అది తొలగించుకోవటానికి ప్రయత్నం చేయవచ్చు. గురువుపట్ల నీకు సజీవమైన విశ్వాసం ఉంటే నీ దుష్టబుద్ధిని నీకు ఎరుకలోనికి తెస్తాడు, తేవటమేకాదు దానిని తొలగించుకొనేశక్తిని ఇస్తాడువాడు గురువు. మోక్షం పొందాలి, ఈశ్వరుని పొందాలి అనేది కోరికే. విషయాలను అనుభవించాలి అనేదీ కోరికే. ఇది విషమకామం, అది ఈశ్వర కామం. ఇది విషయ పిచ్చి, అది ఈశ్వరపిచ్చి. భక్తులందరు పిచ్చిలో ఉన్నారు అని చాలామంది అనుకొంటారు. భక్తులు పిచ్చిలో ఉన్నమాట నిజమే. భక్తులందరు పిచ్చిలో ఉన్నారు అనుకొనేవారు కూడా పిచ్చిలోనే ఉన్నారు. విషయచింతన పిచ్చిలో ఉన్నవాడు అది పిచ్చి అనుకోవటంలేదు ఎవడైనా ఈశ్వరుని చింతనలో ఉంటే వాడు పిచ్చివాడు అంటున్నాడు. నీ దేహానికి చనిపోవటానికి టైము ఉంది. ఈలోపుగా మీరు పిచ్చిని విడిచిపెట్టవద్దు. విషయపిచ్చిని

ఈశ్వరపిచ్చిగా మార్చుకోండి. నీవు వేరు, నేను వేరు అనుకొన్నంతకాలం నీ మీద ఎంతప్రేమ ఉన్నా అద్వైత సుఖం నాకు అందదు. నీ మీద పిచ్చిపోకపోతే పునర్జన్మ తప్పదు. నీమీద నాకు ఉన్న పిచ్చి నీదయ వలననే పోవాలి. నీదయవలన ఒక్కసారి నీమీద ఉన్న పిచ్చి కూడా పోయింది అనుకో నేను గూటిలో పడిపోతాను, నా ఇంటికి వెళ్ళిపోతాను. అప్పుడు నాకు శాశ్వతమైన సుఖం, శాంతి కలుగుతుంది. భక్తిలో ఎంతోకొంత ద్వైతం ఉంటుంది. ద్వైతం అద్వైతానికి దారితీయాలి.

కొంతమంది చేతులు చూపించుకొంటారు. మాకు అదృష్టం ఎప్పుడు కలిసివస్తుంది అని అడుగుతారు. దీనికి భగవాన్ ఏమంటున్నారు అంటే చేతులలో ఏముంది? లోకంలో ఏముంది? ప్రారబ్ధంలో ఏముంది? విధిలో ఏముంది? నేను ప్రారబ్ధమును అనుభవిస్తున్నాను, దురదృష్టాన్ని అనుభవిస్తున్నాను, అదృష్టాన్ని అనుభవిస్తున్నాను అని ఎవడైతే నీలోపల ఉండి అనుకొంటున్నాడో వాడిని ఈశ్వరుడికి శరణాగతి చేస్తే నీకు మంచి ప్రారబ్ధం ఉంటే ఏముంది? చెడ్డ ప్రారబ్ధం ఉంటే ఏముంది? భవిష్యత్తులో నీకు వాహనప్రాప్తి ఉంది అనుకో ఉంటే ఏముంది? లేకపోతే ఏముంది? అనుకొనేవాడిని ఈశ్వరుడికి శరణాగతి చేస్తే నీ శరీరం స్మశానంకు వెళ్ళే వరకు నీవు సుఖంగా బ్రతకవచ్చు. చనిపోయిన తరువాత గొడవ వదిలి వెయ్యండి ఈ లోపుగా సుఖంగా, శాంతిగా బ్రతకవచ్చు. ఇది కేష్‌బేరమే అరువుబేరం కాదు. శరణాగతి చేసినవాడు అదృష్టం వస్తే పొంగిపోడు, దురదృష్టం వస్తే కృంగిపోడు. శరణాగతి పొందినవాడిని విధి ఏమీ చేయలేదు. నీ దేహానికి మరణం వచ్చే రోజుకయినా ఏదైతే నీకు బంధకారణమో దానిని విడిచిపెట్టు. ఈలోపుగా కొద్దిగా ప్రిపేర్ అయితే అప్పుడు విడిచిపెట్టగలుగుతావు. ఏనేను అయితే మనం అనుకొంటున్నామో ఆ నేనును విడిచిపెడితే శూన్యంలోనికి వెళ్ళిపోతామేమో అని మనభయం. దానిని విడిచిపెడితే శూన్యంలోనికి వెళ్ళము చైతన్యస్రవంతిలో కలుస్తాము. శరీరం మీద ఉన్న దుమ్ము అంతాపోతే ఏమీ ఉండదు అనుకోకు, దుమ్ముపోతే శుభ్రత మిగులుతుంది. అదేవిధంగా, అహంకారం పోగొట్టుకొంటే నీవు పోతావు అనుకోకు, చైతన్యంగా మిగులుతావు, ఉండటం అనేది నీకు సహజమైపోతుంది. ఏదో ఊహించుకొని మీ మనస్సును పాడుచేసుకోవద్దు, సహజంగా ఉండాలి, పనిచేస్తూ జ్ఞానాన్ని పొందాలి. పనికూడా జీవితంలో ఎన్నో పాఠాలు నేర్పుతుంది. మీరు పూజ ఎలా శ్రద్ధగా, భక్తిగా చేస్తారో అలాగే పనికూడా శ్రద్ధగా, భక్తితో చేయాలి. బంతి జారిందంటే ఎక్కడికి వెళ్ళి ఆగుతుందో చెప్పలేము. అలాగే మనం చైతన్యంలోనుండి జారితే కక్షలు, అసూయ, ద్వేషం, మనస్సులో ఉన్న పెంట అంతా వచ్చేస్తుంది, మనం ఎక్కడికి వెళతామో చెప్పలేము.

మేము నాలుగు గంటలకు నిద్రలేస్తేనే మాపని అవ్వటంలేదు. ఇంకా మీరు ధ్యానం చెయ్యి, జపం చెయ్యి అని చెపుతున్నారు, అదనంగా బరువు పెడుతున్నారు. ఏదో బరువు దింపుతారని మీ దగ్గరకు వస్తే ఇంకా బరువు పెట్టి వెళ్ళిరమ్మంటున్నారు. ఇదేమి జ్ఞానం అండి అని ఒక భక్తుడు భగవాన్‌ను అడుగుతున్నాడు. భగవాన్ వాడితో రాజీపడుతున్నారు వాడితో ఏమి చెపుతున్నారు అంటే నీకు అదనంగా భారం పెట్టను. నీవు ఒక మాట మాట్లాడితే, ఒక పనిచేస్తే, నీకు ఒక

తలంపు వస్తే, మనం సంఘజీవులము కదా ఇతరులతో ఏదైనా వ్యవహారం చేస్తే ఆ వ్యవహారం ఇవి అన్నీ ఎలా ఉండాలి అంటే సత్యజ్యోతిలో, హృదయగుహలో నీ మనస్సు వెళ్ళి కలిసిపోయేలా ఉండాలి. నీకు అదనంగా ఏమీ చేయమని చెప్పటం లేదు. నీవు చేసే పని, నీవు మాట్లాడేమాట, నీతలంపు, నీ వ్యవహారశైలి ఎలా ఉండాలి అంటే నీ మనస్సు జ్ఞాన జ్యోతిలో ఐక్యమవ్వటానికి అవి సహకరించేలా ఉండాలి, అలా తీర్చి దిద్దుకో. అలాగైనా నీకు బ్రహ్మానుభవం కలుగుతుంది. మా పనులు చేయటానికే టైము చాలటంలేదు ఇంక పూజలు ఏమి చేస్తాము అని ఒకరు భగవాన్‌ను అడుగుతున్నారు. మీ పనులు మానేసి దేవుని పూజించమని నేను చెపుతున్నానా? నీ పనులు నీవు చేసుకో కాని దేవుడు చెప్పినట్లు చెయ్యి దేవుని దగ్గరకు వెళ్ళిపోతావు. భగవాన్ ఇంకొకటి చెపుతున్నారు. ఒకడు దేవుని పటానికి పూజిస్తూ దేవుడు చెప్పినట్లు చేయడు అనుకో. నీవు దేవుని పటాన్ని పూజించకపోయినా దేవుడు చెప్పినట్లు చేస్తున్నావు అనుకో. వాడికంటే నీవే ముందు దేవుని దగ్గరకు వెళ్ళిపోతావు. మా అమ్మ చాలామంచిది, మా అమ్మ చాలామంచిది అని చెపుతూ టైముకు అన్నం పెట్టని వారికంటే మీ అమ్మని పొగడకపోయినా టైముకు అన్నంపెడితే నీవే తొందరగా దేవుని దగ్గరకు వెళతావు. దేవుడు ఎలాపనిచేయమని చెప్పాడో అలా పనిచేస్తూ ఉంటే వ్యక్తులపట్ల, సమాజం పట్ల, సంఘటనల పట్ల మీ స్వభావం మారిపోతుంది. ఇదివరకు ఎవరినైనా చూస్తే కొట్టాలి అనిపించినా ఇప్పుడు ముద్దు పెట్టుకోవాలని అనిపిస్తుంది. పూర్వం ప్రవర్తించినట్లు వారిపట్ల ప్రవర్తించవు. భగవాన్ చేసే ప్రయత్నం ఏమిటి అంటే నీకు దేవుని చూపించటమేకాదు, నిన్ను దేవుడిని చేసేస్తున్నారు.

నేను గొడవ చెప్పకండి. ఎవరు వచ్చినా మీరు నేనుగురించే చెపుతున్నారు. ఆ గొడవ వద్దు అని ఒకరు భగవాన్‌తో అంటున్నారు. భగవాన్ ఏమంటున్నారు అంటే పోనీ ఆనేనును మర్చిపో, దానిని ఉపయోగించటం మానివెయ్యి అంటున్నారు. నేనును జ్ఞాపకం తెచ్చుకొంటున్నారు అందువలన దానిని విచారణ చెయ్యండి, దానిమూలం తెలుసుకోండి అని చెపుతున్నాను. ఆ నేను గొడవవద్దు అంటున్నావు. ఆనేను గొడవేనీకు లేదు అనుకో విచారణ అక్కరలేదు. వారికంటే నీకు ముందు జ్ఞానం కలుగుతుంది. ఆనేను నీకు అక్కరలేదు అనుకో నీవు ఇంక జ్ఞానంలోనే ఉన్నావు. అసలు అది లేనేలేదు. అదిలేదు అని ఎప్పుడు తెలుస్తుంది అంటే స్వప్నంలో అనేక దృశ్యాలు కనబడతాయి జాగ్రదావస్థలోనికి రాగానే అవి మిధ్య అని నీకు తెలుస్తుంది. అలాగే నీకు జ్ఞానోదయం అయినవెంటనే నీవు సాధనచేసి ఏనేనునయితే తొలగించుకోవాలి అనుకొంటున్నావో ఆనేను లేనేలేదు అని నీకు తెలుస్తుంది. నీవు ఎవరితో మాట్లాడినా, ఏపనిచేసినా ప్రేమతో చెయ్యి, చిత్తశుద్ధితో చెయ్యి. గుడిలో దేవుని చూడకపోయినా నీవు ఎవరికైతే అన్నం పెడుతున్నావో వాడిలో దేవుని చూసి ఆనందించు. మీరు ఎవరికైతే సేవ చేస్తున్నారో వారికి కృతజ్ఞత లేకపోయినా, ఎవరైతే ఆపని చేయమని మీకు చెప్పారో వారికి కృతజ్ఞత లేకపోయినా వారిపట్ల నీవు డ్యూటీ చేస్తూ ఉంటే ఈశ్వరుడు అనుగ్రహిస్తాడు, ఆయన దయకు పాత్రుడవుతావు. ఆ ఈశ్వరుడే మీ హృదయంలో కూడా ఉన్నాడు కాబట్టి ఆయన మీకు వ్యక్తమవుతాడు. శరణాగతి చేసినవాడికి అదృష్టం ఏల? దురదృష్టం ఏల? విధి అంటూవాడిని ఏమీ చేయలేదు. ఈవాక్యం గుర్తు పెట్టుకొంటే దుఃఖం అంతా ఆరిపోతుంది.

05-04-2001

## ఏ కోరిక లేకుండా పూర్ణశరణాగతిలో ఉన్నవాడే నిజమైన భక్తుడు.

### సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 25-2-2001, సామర్లకోట

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

మానవుడు దుఃఖం లేనిస్థితిని పొందాలి, ఏమతం యొక్క గమ్యం అయినా అదే. మన శరీరాలు అన్నీ స్వప్న శరీరాలే. స్వప్నంలో మనకు శరీరాలు కనిపిస్తాయి. ఆ శరీరాలు ఎటువంటివో నీకు ఆత్మశాంతి కలిగాక ఈ భౌతిక శరీరాలు కూడా అటువంటివే అని మనకు అర్థమవుతుంది. మనకు సంపద ఉన్నా, సంపదలేకపోయినా, చదువున్నా చదువు లేకపోయినా ఒక విషయం గుర్తుపెట్టుకోవాలి. ఈ లోకానికి మనకి ఏ వస్తువు అయితే ఆధారంగా ఉందో, ఏ వస్తువు ఉండటంవలన ఈలోకం ఉన్నట్లు మనకి తెలియబడుతోందో ఆ బ్రహ్మం అంతటా ఉంది, అది మన హృదయంలోకూడా ఉంది. ఆ బ్రహ్మానుభవం మనకు కలిగే వరకూ కోటి జన్మలు ఎత్తినా అశాంతి, దుఃఖం మనలను విడిచిపెట్టవు. దేవుడు వైకుంఠములోను, కైలాసంలోను ఉన్నాడు అనుకొంటున్నాము. అవి అన్నీ మన మనస్సు ఎంత నిజమో అవికూడా అంతేనిజం. మనలను నియమించేవాడు, మనం తెలుసుకోవలసిన వస్తువు మన హృదయంలోనే ఉంది. ఏమండి భగవంతుడిని తెలుసుకోవాలని ఉంది అని శేషాద్రిస్వామిని అడిగితే లోపలకు వెళ్ళు, లోపలకు వెళ్ళు మధ్యలో తిరిగిరాకు వాడు ఎక్కడ ఉన్నాడో అక్కడివరకు లోపలకు వెళ్ళు. అక్కడ దేవుడు నీకు దర్శనం ఇస్తాడు అని శేషాద్రి స్వామివారు చెప్పేవారు. అక్కడకు వెళ్ళిన తరువాత పూజతోను, జపంతోను, ఒక సాంప్రదాయంతోను పనిలేదు. వస్తువు మన హృదయంలోనే ఉంది. అది మనకు తెలియకపోవటానికి కారణం మనకు ఉండవలసినంత వైరాగ్యంలేదు, అభ్యాసం లేదు. సరిఅయిన అవగాహనలేదు. అవగాహన లేకపోవటానికి కారణం మనం చదివే పుస్తకాలు మంచివి కావు, మనం చేసే స్నేహాలు మంచివికావు. తపస్సు అంటే ఎవరికీ ఇష్టం లేదు. తపస్సు లేకుండా జీవుడు పవిత్రుడు కాడు. మనస్సును ఎండింపచేయటమే తపస్సు. శాస్త్రం ఏమి చెపుతోంది అంటే లోపల ఉన్న సద్వస్తువు ఎంత పరమపవిత్రమైనదో జీవుడు కూడా అంత పవిత్రుడు అయితేగాని జీవుడు అందులో ఐక్యం కాలేడు. అలా ఐక్యం చేయటానికే యోగాలన్ని భక్తియోగం, కర్మయోగం, ధ్యానయోగం ఇవి అన్నీ.

సూర్యుడు మనకు కనిపించకుండా మబ్బు అడ్డువస్తోంది. అలాగే నీ హృదయంలో ఉన్న జ్ఞానసూర్యుడు నీకు కనిపించకుండా మనస్సు అనే మబ్బు అడ్డువస్తోంది, ఇతరులు ఎవరూ నీకు అడ్డురావటం లేదు. మనస్సు ఏమి చేస్తుంది అంటే దానిని శోధిస్తారేమోనని ఇతరుల మీదకు గెంటేస్తుంది. వారు అడ్డువస్తున్నారు, వీరు అడ్డువస్తున్నారు అని చెపుతుంది. మనస్సు ఏ పని చేయమన్నా చేస్తుందిగాని తన మూలంలోనికి వెళ్ళటానికి మనస్సు ఇష్టపడదు.

ఎందుచేతనంటే మనస్సు దాని మూలంలోనికి వెళితే మనస్సు ఉండదు. అందువలన జపం చేయమన్నా, ధ్యానం చేయమన్నా చేస్తుంది గాని దాని మూలంలోనికి వెళ్ళటానికి అది ఇష్టపడదు. జీవితం పొడుగునా వివేకం కాపాడుకోవాలి. ఏది ఆత్మ ఏది అనాత్మ. ఏది మనకు శాశ్వత శాంతిని ఇస్తుంది, కర్మ ఎలా చేస్తే మన మనస్సు పవిత్రం అవుతుంది అని వివేకం లోపల కాపాడుకోవాలి. నిన్ను నీవే ఉద్ధరించుకోవాలి. నిన్ను నీవు ఉద్ధరించుకోవటం మానివేసి ఎవరోవచ్చి ఉద్ధరిస్తారని కనిపెట్టుకొని ఉండకండి. దానివలన సోమరితనం వస్తుంది. సోమరితనం ఉన్నవాడికి ఈలోకం లేదు, పరలోకం లేదు. నిజమైన భక్తుడికి సంకల్పం ఉండదు. సంకల్పం ఉన్నవాడు భక్తుడు కాడు. భక్తుడు వాడు చేసేపని హృదయ పూర్వకంగా చేస్తాడు. జరిగేది ఏదో జరుగుతుంది, జరగనిది ఏదో జరగదు. ఇది ఇలా జరిగింది ఏమిటి? అది అలా జరగలేదు ఏమిటి అని అనుకొనేవాడు భక్తుడుకాదు. భగవంతుని సంకల్పమే తన సంకల్పం, భగవంతుని ఇష్టమే తన ఇష్టం అనుకొనే వాడు నిజమైన భక్తుడు. మనం భక్తులమైతే ఆ లక్షణాలు మనకు ఉన్నాయో లేవో మనం చూసుకోవాలి. మన భక్తి ఎలాగ ఉంది అంటే ఎక్కడ చూసినా మనమే. తిరుపతిలో చూసినా, కాశీలో చూసినా అన్ని దేవాలయాలలోనూ మనమే. దేవాలయాలకు వెళ్ళి మనం కోరేది ఏమిటి అంటే మనలో ఉన్న కామక్రోధాలు, అసూయ ఇవి అన్నీ అలాగే ఉండిపోవాలి బయటివి ఏవో అడుగుతాము. ఇది మనం చేసేపని. దేవాలయానికి వెళ్ళి నాలో ఉన్న కామక్రోధములను తొలగించమని అడిగే భక్తులు ఎంతమంది ఉన్నారు. భగవంతుడిని మనం ప్రార్థించేది ఏమిటి అంటే భగవంతుడు మన హృదయంలోనే ఉన్నాడు ఆయన అనుభవం పొందటానికి మనలో ఏ బలహీనతలు అడ్డువస్తున్నాయో వాటిలో నుండి మనలను విడిపించమని దేవుని ప్రార్థించాలి గాని ఈ బలహీనతలు అలాగే ఉంచుకొని లోకంలో కనిపించే వస్తువులు ఇవ్వమని అడుగుతూ ఉంటే ఆయన ఇస్తే ఇస్తాడుకాని జ్ఞానం మటకు సున్న. మనకు సహనం లేదు, ప్రేమ లేదు. ప్రేమలేనివాడికి జ్ఞానం కలుగదు. నిజంగా మీ మీద నాకు ప్రేమ ఉంది అనుకోండి మీలో పొరపాట్లు ఉన్నా నాకు కనబడవు. మీమీద నాకు ప్రేమ లేదు అనుకోండి. మీలో చిన్నపొరపాటుకూడా చాలా పెద్దదిగా కనబడుతుంది. మీ ఇంట్లో ఎవరైనా పొరపాటుచేస్తే వెల్లడిచేయరు. ప్రక్కఇంటిలో ఎవరైనా పొరపాటుచేస్తే వెల్లడిచేస్తారు. అంటే మీ ఇంట్లో ఉన్న వారిమీద మీకు ఉన్న ప్రేమ ప్రక్క ఇంట్లో ఉన్నవారిమీద లేదు. ఇది దేవుడు చూస్తున్నాడు కదా మీకు మోక్షం ఎలా ఇస్తాడు.

ఉన్నది ఒక్కటే వస్తువు. అదే బ్రహ్మం. ఆ బ్రహ్మంను జీవుడు అనుకొంటున్నారు. అందువలన పొగడ్తలకోసం చూస్తున్నారు అంటే జీవలక్షణాలను పెంచుకొంటున్నారు. ఉన్నది ఒక్కటే అయినప్పుడు పొగడ్త ఏమిటి? వేరుభావన ఉన్నప్పుడు పొగడ్తలకోసం చూస్తాము. మీరు ఎంతపూజ చేసినా, జపం చేసినా అందరూ మనలను మెచ్చుకోవాలి అనుకొంటే మీ చేతులతో మీరే నరకానికి మెట్లు కట్టుకొంటున్నారు. పొగడ్తల కోసం చూసే వారందరికి

మిగిలేది నరకం. పొగడ్తలకు అలవాటు పడ్డాను, ఈ పొగడ్తలలో నుండి నన్ను విడుదల చేయమని ఒక్కడూ దేవుడిని ప్రార్థించడు. జ్ఞాని చాలా నిర్దిష్టంగా ఉంటాడు. జ్ఞానియొక్క జీవిత విధానం స్పష్టంగా ఉంటుంది. అందరిలోను వ్యత్యాసాలు ఉన్నప్పటికీ అవి అన్నీ పైపై గొడవలు అని ఆయనకు తెలుసు. మనస్సులో గుణాలు ఉంటాయి, శరీరాలను చూసినప్పుడు స్త్రీ పురుష భేదం. ఈ శరీరాలను, మనస్సును అతిక్రమించి చూస్తే అంతా బ్రహ్మమే, జ్ఞాని అది చూస్తూ ఉంటాడు. భగవంతుడు చెప్పినట్లుగా మనం జీవిస్తూ ఉంటే, భగవంతుని ప్రేమిస్తూ ఉంటే ఆ భగవంతుడే గురురూపంలో వచ్చి మన అజ్ఞానాన్ని తొలగిస్తాడు. వాడు గురువు. మనలో ఉన్న మూలమలాన్ని అంటే అజ్ఞానాన్ని తొలగించటానికి గిరే గురురూపంలో వస్తుంది. మంచివాడికి, చెడ్డవాడికి కూడా దేహము నేను అనే బుద్ధి ఉంటుంది. దేహాన్ని ఆత్మ అనుకొంటాడు. ఆత్మకాని దానిని నీవు ఆత్మ అనుకొంటున్నావు. నీలో ఉన్న ఆ మూలమలాన్ని పోగొట్టటానికి గిరిగా ఉన్న దేవుడే గురురూపంలో వస్తాడు. వారు ఏమనుకొంటున్నారు, వీరు ఏమనుకొంటున్నారు అని చూస్తూఉంటే దానివలన మీకు భయం కలుగుతుంది, భయం వలన దుఃఖం వస్తుంది. ఆత్మ ఏమీ అనుకోదు. అనుకొనేది అహంకారం. ఎంతమంది అహంకారాలకు మీరు జడుస్తారు. ఏదైనా అవసరమైతే మాట్లాడతాము. మాట్లాడటమే మన గమ్యం కాదు. ఏదైనా పని ఉంటే నడిచి వెళతాము. నడవటమే మన గమ్యం కాదు. ఇలా రకరకాల పనులు చేస్తాము. అవి మన గమ్యం కాదు. లోపలఉన్న సత్యవస్తువును అనుభవంలోనికి తెచ్చుకోవటమే మన గమ్యం. మన గమ్యం ఎంతో దూరంలో ఉంది అనుకొంటున్నాము. అలా అనుకోవటం వలన మనం టైర్ అవుతున్నాము. మన గమ్యం చాలా దగ్గరగా ఉంది, మన శరీరం కంటే మన ఇంద్రియముల కంటే అత్యంత దగ్గరగా మన హృదయంలోనే ఉంది అని మనకు అర్థమయితే మనం టైర్ అవ్వము. మనం ఎంతో కష్టపడితేనే గాని భౌతికసంపద కూడా రాదు మరి ఏమీ కష్టపడకుండా మనకు ఆత్మజ్ఞానం ఎలా కలుగుతుంది. ఆత్మజ్ఞానం సంపాదిస్తే మనం సుఖపడతాము, ఇంక పునర్జన్మలు రావు. ఆత్మజ్ఞాన సముపార్జన మీద దృష్టిలేకుండా కేవలము భౌతిక సంపదలకే పరిమితమైపోతే ఇంట్లో వారిచేతకూడా తిట్లు తింటావు. అజ్ఞానం అనే చీకటిని పోగొట్టేవాడే గురువు. నీవు ఎవరో నీకు తెలియకపోవటమే అజ్ఞానం. అజ్ఞానంను మూలమలం అంటారు. ఆ మూలమలం ఎవరికైతే పోయిందో వాడు అందరిపట్ల దయ కలిగి ఉంటాడు. అన్నంతిన్న తరువాత విస్తరిని బయట పడేస్తాము, ఆవిస్తరి ధ్యాస మనకు ఉండదు. అలాగే జ్ఞానికి దేహం వదిలేసాక ఆదేహం గొడవ వాడికి ఉండదు. జ్ఞానిని మీరు గౌరవిస్తారు అనుకోండి జ్ఞానికి వచ్చేలాభం ఏమీలేదు, వాడి పుణ్యంలో మీకు వాటా వస్తుంది. ఆనందం కోసం, శాంతి కోసం జ్ఞాని బాహ్యమైన విషయాలమీద, ఇతరులమీద ఆధారపడ నక్కరలేదు. వాడికి ఆనందము లోపలనుండే వస్తుంది. వాడు బ్రహ్మమై ఉన్నాడు కాబట్టి అక్కడనుండే వాడికి ఆనందం అందుతూ ఉంటుంది. దేహముతో తాదాప్యం లేనివాడికి

ఎంత దుఃఖం వచ్చినా వాడు చలించడు. సుఖ ప్రారబ్దం వచ్చినా, దుఃఖ ప్రారబ్దం వచ్చినా దేహానికే కదా వాడికి దేహముతో తాదాప్యం లేదు కనుక వాడు వీటికి అతీతంగా ఉంటాడు. అహంవృత్తి ఎంతసేపు బయటకు చూస్తూ ఉంటుంది. గురువు దానిని గమనిస్తూ ఉంటాడు. దీనికి బయటకు చూడటమే పని లోపలకు చూడటం లేదు అని గురువు ఏమిచేస్తాడు అంటే అహంవృత్తిని లోపలకు మళ్ళించి దానికి లోచూపునేర్పుతాడు. నీ మనస్సును అంతర్ముఖపరచే వాడే గురువు. ఉన్నది చైతన్యం ఒక్కటే రాముడిని పూజించే వారు అందరూ రాముడే దేవుడు అని కృష్ణుడు దేవుడు కాదు అని, కృష్ణుడిని ఆరాధించేవారు అందరూ కృష్ణుడే దేవుడని రాముడు దేవుడుకాదని అంటే వారికి ఏమీ తెలియదు అని అర్థం. ఎవడి సాంప్రదాయాన్ని వాడు పోషించుకోవటమేపనిగా పెట్టుకోకూడదు. అసలు మనిషిని ఎక్కడకు తీసుకొని వెళ్ళాలో బోధించేవాడికి తెలియాలి. మిమ్మల్ని అందరిని రమణమహర్షి భక్తుల క్రింద చేయాలని ఇక్కడకు రాలేదు. మీరు అందరూ రమణ మహర్షి భక్తులు అవుతారు అనుకోండి, మిమ్మల్ని దుఃఖం విడిచిపెట్టదు, అశాంతి విడిచిపెట్టదు అనుకోండి, మాకు కలసి వచ్చేది ఏమిటి? మీకు కలిసివచ్చేది ఏమిటి? నేను చెప్పేమాట దుఃఖం నుండి, అశాంతి నుండి, బంధం నుండి విడుదల పొందటానికి మీకు సహకరించాలి, లేకపోతే ఈ మాటలు అనవసరం.

**మన దేహమునకు సుఖ ప్రారబ్ధము వచ్చినప్పుడు గర్వం రాకుండా చూసుకోవాలి. మానవుడి పతనమునకు గర్వమే కారణము.**

## శ్రీ రమణ క్షేత్రం వారి పబ్లికేషన్స్

| నెం. | పుస్తకం పేరు | వెల |
|---|---|---|
| 1. | చినీలాకాశంలో చింతకాంతి | 25/- |
| 2 | అమృత వాక్కులు | 20/- |
| 3. | శ్రీ రమణ ప్రస్థాన త్రయం | 12/- |
| 4. | నైవ సంపద | 10/- |
| 5. | జ్ఞాన కిరణాలు | 6/- |
| 6. | అక్షరమణమాల ఉపదేశసారము | 4/- |
| 7. | రమణ భాస్కర బైండులు, 1999-2000 | 100/- |
| 8. | రమణ భాస్కర బైండులు, 1998-1999 | 75/- |
| 9. | శ్రీ రమణ మహిమలు | 10/- |
| 10. | The Call of the Holly Hill | 20/- |

పై పుస్తకములు 50 ప్రతులకు పైన తీసుకున్నవారికి 25% డిస్కౌంటు ఇవ్వబడును.

## మా వద్ద లభించు శ్రీరమణాశ్రమం తిరువన్నామలై వారి పుస్తకములు

| నెం. | పుస్తకం పేరు | వెల |
|---|---|---|
| 1. | నీ సహజ స్థితిలో ఉండు | 50/- |
| 2 | శ్రీ రమణ భాషణములు | 80/- |
| 3. | శ్రీ రమణ లేఖలు | 80/- |
| 4. | శ్రీ రమణ దివ్య జీవిత మకరందం | 50/- |
| 5. | ఆత్మ సాక్షాత్కారము | 80/- |
| 6. | శ్రీ మహర్షి | 20/- |
| 7. | శ్రీ రమణ మహర్షివారి ఉపదేశము | 20/- |
| 8. | శ్రీ రమణోచ్ఛ్వాసము | 10/- |
| 9. | నేను ఎవడను? | 3/- |
| 10. | నాయన | 100/- |
| 11. | శ్రీ రమణ గీత | 10/- |
| 12 | శ్రీ రమణ కథా సుధ | 10/- |
| 13. | శ్రీ రమణ వైభవము | 40/- |
| 14. | ఋభు గీతాసారము | 15/- |

పై పుస్తకములు 50 ప్రతులకు పైన తీసుకున్నవారికి 10% డిస్కౌంటు ఇవ్వబడును.

2000-2001 సంవత్సర చందా రు. 140/-లు మరియు ఆడియో కేసెట్ ధర రు. 35/-లు.

## చందాదారులకు గమనిక :

నూతన చందాదారులు, రెన్యువల్ చేసే చందాదారులు చందా సొమ్మును ఎం. ఓ ద్వారా పంపితే మీ చందా వివరాలు నమోదు చేసుకొనబడును. ప్రతినెల మేము పంపించు మాస పత్రిక మీకు చేరకపోతే మీ అడ్రస్సు కూపన్ ప్రకారం పూర్తి డిటైల్స్‌తో వెంటనే మాకు తెలియజేయండి.

మీ చిరునామాలో మార్పు ఉంటే దయచేసి వెంటనే మాకు తెలియజేయండి. ఆవిధముగా తెలియజేసినచో పత్రిక నేరుగా మి క్రొత్త చిరునామాకు వచ్చి చేరుతుంది. మాకు వ్రాసే ఉత్తరాలలో మీ చందా రశీదు నెంబరును తెలియపరచడం మరువకండి.



శ్రీ రమణాశ్రమం, తిరువన్నామలై



ఆంధ్రాశ్రమం, తిరువన్నామలై



శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు

**REGISTERED NEWS PAPER**

**RNI NO. APTEL/1999/1667-POSTAL REGN.NO. AP/VJA/32/5/2000**




To

**A. Lakshmi**
Plot No. 150, Rao & Raju Colony
Banjara Hills, Road No. 2
HYDERABAD - 500 034

*If undelivered please return to :*

**RAMANA BHASKARA**
SRI RAMANA KSHETRAM,
**JINNURU - 534 265.** W.G. Dt. A.P.

Editor, Printer, Publisher : **P.S. RAMA RAJU**
Lakshmi Modern Rice Mill, Ullamparru, PALAKOL - 534 260. W.G. Dt. ☎ : 08814-24589, 24689
Printed at : **SHRIRAM GRAPHICS**, Bank Street, PALAKOL - 534 260. W.G. Dt. ☎ : 22438, 24278